క్లుప్తంగా

ఓదూరు సర్పంచ్ బరిలో నలుగురు..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరులో ఈ నెల 19 న జరుగనున్న సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆరుగురు నామినేషన్లు దాఖలు చేయగా 6 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వారిలో ఇద్దరు సోమవారం తమ నామినేషన్లు విత్‌డ్రా చేసుకోవడంతో మిగిలిన నలుగురికీ ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. ఉప ఎన్నికకు కారణమైన మృతి చెందిన సర్పంచ్ బుంగా మేరీ అత్తగారు బుంగ బుల్లమ్మ ఎన్నికల బరిలో నిలవగా ఆమెకు ఉంగరం గుర్తును కేటాయించారు. మిగిలిన అభ్యర్థులు కోనాల అనంతలక్ష్మికి మంచం, తాతపూడి గంగాభవానికి కత్తెర, వింజుమళ్ల విమలకుమారికి బుట్ట గుర్తులు కేటాయించారు. దీంతో గ్రామంలో ఎన్నికల వేడి రాజుకుంది.

నేడు అంగరలో రక్తదాన శిబిరం

కపిలేశ్వరపురం: అంగరలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రేమస్ఫూర్తి సహాయ పరిచర్య ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీ క్లినికల్ ల్యాబొరేటరీ సహకారంతో నిర్వహించే శిబిరంలో రక్తదానం చేసిన వారికి ఉచితంగా బ్లడ్ గ్రూప్ పరీక్ష చేస్తామన్నారు.

ఎరువుల దుకాణంలో 'విజిలెన్స్' తనిఖీలు

మండపేట: మండలంలోని అర్తమూరులో గల శ్రీకల్కి చెన్నకేశవ ఎరువుల దుకాణంలో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఫారం ఓ లేకపోవడం, స్టాక్ బోర్డును అప్డేట్ చేయకపోవడంతో పాటు గ్రౌండ్ స్టాక్‌నకు స్టాక్ రిజిస్టర్‌కు మధ్య వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. షాపుపై 6ఏ కింద కేసు నమోదు చేసి రూ.1,865 విలువ కలిగిన 315 కిలోల యూరియాను సీజ్ చేశారు. కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


సంపూర్ణ ఆహారంతో ఆరోగ్యకరమైన సమాజం

కపిలేశ్వరపురం: సంపూర్ణ పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తాతపూడి గ్రామ ప్రజాప్రతినిధులన్నారు. గ్రామంలో సోమవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించి, పోషకాహార కిట్లు అందజేశారు. సర్పంచ్ గూటం శ్రావణి, ఎంపీటీసీ సభ్యురాలు జిత్తుక వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి

మండపేట: ఈనెల 16న టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మండపేట పర్యటనను పార్టీ శ్రేణులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం ఉదయం మధురపూడి ఎయిర్ పోర్టు నుంచి మడికి, దుళ్ల మీదుగా చంద్రబాబు నాయుడు మండపేట మండలం ఏడిద చేరుకుని రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం బైపాస్ రోడ్డు మీదగా మండపేట చేరుకుని రాజారత్న సెంటర్ నుంచి కలువపువ్వు సెంటర్ వరకూ రోడ్ షో నిర్వహిస్తారన్నారు. కలువపువ్వు సెంటర్‌లో బహిరంగ సభలో పాల్గొని రాత్రికి ఆలమూరు రోడ్డులోని కన్వెన్షన్ హాలులో బస చేస్తారన్నారు. 17వ తేదీ కార్యకర్తలు నాయకులతో ఇష్టాగోష్ఠి అనంతరం కొత్తపేట నియోజకవర్గానికి బయలు దేరి వెళతారని వారు వివరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అమర వీరులకు కొవ్వొత్తులతో నివాళి



అమర వీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మండపేట: స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సోమవారం రాత్రి బీజేపీ నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ కేవీవీ సాయిరాం ఆధ్వర్యంలో స్థానిక కలువ పువ్వు సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, నాయకులు కోన సత్యనారాయణ, చాట్రాతి జానకి రాంబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసి హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ నాయకులు వల్లభినేని రవీంద్ర బాబు, ఇళ్ల వెంకటేశ్వరరావు, ఇళ్ల సత్యనారాయణ, గోడవర్తి రామచంద్రరావు, నరాల రాంబాబు, రాంబాబు, రాయి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు స్వాతంత్ర్య శోభ



సెంట్రల్ లైటింగ్‌లో ఏర్పాటు చేసిన రోప్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి



మండపేట మెయిన్ రోడ్డులో జాతీయ జెండా రంగులతో శోభాయమానంగా సెంట్రల్ లైటింగ్

మండపేట: పట్టణంలోని మెయిన్ రోడ్డులోని సెంట్రల్ లైటింగ్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల శోభను సంతరించుకుంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి కలువపువ్వు సెంటర్, బస్టాండు, రాజారత్న సెంటర్ మీదుగా పెద కాలువ వంతెన వరకూ దాదాపు రెండు కిలోమీటర్ల మేర డివైడర్ మధ్యలోని వీధిలైట్లు మువ్వన్నెల కాంతులతో దారిన వెళ్లే వారికి కనువిందు చేస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు మెయిన్ రోడ్డులోని 48 సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు జాతీయ జెండా రంగులతో రోప్ లైటింగ్ ఏర్పాటుచేశారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి స్విచ్ ఆన్ చేసి ఈ లైటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగను విజయవంతం చేయాలని కోరారు. వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కమిషనర్ టి. రామ్‌కుమార్, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ఏఈలు కేవీవీ సత్యనారాయణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏర్పాట్లు

మండపేట పట్టణం, మండల గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు అధికారులు, వివిధ సంఘాల వారు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు, సేవా సంస్థలు, ఆటో, రిక్షా యూనియన్లు, భవన నిర్మాణ కార్మికుల సంఘాల కార్యాలయాలను మువ్వన్నెల జెండాలతో ముస్తాబు చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ దుర్గారాణి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, పంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలలు తదితర చోట్ల సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు తదితరులు జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు.

లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- ఉప్పుమిల్లిలో గడప గడపకూ..



ఉప్పుమిల్లిలో మహిళలకు ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: సీఎం జగన్ పాలనలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని ఉప్పుమిల్లిలో సోమవారం మంత్రి వేణు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేనంతగా పలు పథకాల ద్వారా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. పలు స్థానిక సమస్యలను ప్రజలు మంత్రి వేణుగోపాలకృష్ణ దృష్టికి తీసుకురాగా వాటిపై ఆరా తీసి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, బీసీ సెల్ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు, సర్పంచ్ పెంకే సత్యనారాయణ, పార్టీ నాయకులు మురళి, వద్రే రాము, యాళ్ల సత్తిబాబు, దంగేటి అరుణ్‌కుమార్, టేకుమూడి దుర్గారావు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం



శాఖల వారీగా చర్చ చేపడుతున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి

కపిలేశ్వరపురం: ప్రాధాన్యతా క్రమంలో క్షేత్ర స్థాయి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు అన్నారు. కపిలేశ్వరపురం మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశ అజెండాను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి వివరించగా శాఖల వారీగా సమస్యలపై అధికారుల సమక్షంలో సభ్యులు చర్చించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సాకా శ్రీనివాస్, గుణ్ణం భాను ప్రసాద్, తహసీల్దార్ కొమరం సూర్యారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. మండలంలోని ఇసుక ర్యాంపుల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ వాకతిప్ప ఎంపీటీసీ సభ్యుడు కుంచె ప్రసన్నకుమార్ చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ఖండించారు. పలివెల మధు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఇసుక అక్రమాలు జరిగాయన్న సంగతి మర్చిపోవద్దన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం లేకుండా ఏపీఎండీసీ పర్యవేక్షణలో ప్రతి ఇసుక రేణువును చట్ట పరిధిలో విక్రయాలు జరుగుతున్నాయన్నారు. జెడ్పీటీసీ అబ్బు మాట్లాడుతూ పలు గ్రామాల్లో రైతు భరోసా మంజూరు కావడం లేదని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. నిడసనమెట్టలో టాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో వరుసగా సంభవిస్తున్న చోరీలపై పోలీసులు దృష్టి సారించాలన్నారు. ఎంపీటీసీ గొల్లపల్లి సోనియా, సర్పంచ్ సాకా శ్రీనివాస్ మాట్లాడుతూ కపిలేశ్వరపురం జగనన్న కాలనీలో డ్రైన్ల నిర్మాణ సమాచారాన్ని తమకు చెప్పక పోవడంపై అధికారులను నిలదీశారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ కోరంగి కాలువ గట్టు బలహీన పడిందని, వరినాట్లు ముంపు బారిన పడుతున్నాయన్నారు. కపిలేశ్వరపురం నుంచి అమలాపురానికి ఆర్టీసీ బస్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్బులతో జాతీయ జెండా రూపకల్పన



సబ్బులతో చిన్నారులు రూపొందించిన జాతీయ జెండా నమూనాలు



విద్యార్థినులు గంజ శ్రీలక్ష్మీదేవి, చోడిశెట్టి మహేశ్వరిలు

రామచంద్రపురం రూరల్: అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల కాదేదీ కవితకు అనర్హం అన్న చందంగా మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ 9 వ తరగతి విద్యార్థినులు గంజ శ్రీలక్ష్మీదేవి, చోడిశెట్టి మహేశ్వరిలు సబ్బులతో జాతీయ జెండాను రూపొందించారు. వినూత్నంగా ఆలోచించి తమ దేశభక్తిని చాటుకున్న విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి, డ్రాయింగ్ టీచర్ శ్రీనులు అభినందించారు.

జనరంజకంగా 'జగనన్న పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- చెల్లూరులో గడప గడపకూ



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: పేదల అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమాలు అందిస్తూ వారి పక్షపాతిగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని చెల్లూరులో సర్పంచ్ పాలిక రాఘవ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు పలివెల వెంకట ఆదిలక్ష్మి, వైట్ల వీరవేణి, సొసైటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములుతో కలసి ఎమ్మెల్సీ త్రిమూర్తులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలెవరూ నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితులు రాష్ట్రంలో ఎక్కడా లేవన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన బుక్‌లెట్‌ను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుద్దాల రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చోడె వెంకటరమణ, పార్టీ నేతలు పాలిక గోవిందు, పలివెల రామకృష్ణ, వైట్ల శ్రీధర్, పంతగడ శ్రీను, కోటి అంబేద్కర్, పిల్లి పరశురామ్, పిల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



లబ్ధిదారులకు పోషణ కిట్లు అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

కె.గంగవరం: రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌తో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని సర్పంచ్ తోలేటి కృష్ణమూర్తి, ఎంపీటీసీ కోట సత్తిబాబు అన్నారు. మండలంలోని బాలాంత్రంలో సోమవారం బాలింతలు, గర్భిణులకు టేక్ హోం కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రూ.1500 నుంచి రూ.1700 విలువైన పది రకాల ఆహార వస్తువులు ఉన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసమే సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా కష్ట కాలంలో కూడా పేదల సంక్షేమం కోసం నవరత్నాలు అమలు చేసి ప్రజలకు సీఎం అండగా ఉన్నారని గుర్తు చేశారు. ఇకపై ప్రతి నెలా సంపూర్ణ పోషణ కిట్లు ఇంటి వద్దకు అందిస్తారని తెలిపారు.

సైనిక కుటుంబాల సభ్యులకు సత్కారం



కపిలేశ్వరపురంలో మిలటరీ కుటుంబాల సభ్యులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కపిలేశ్వరపురం: స్థానికంగా ఉన్న మిలటరీ కుటుంబాల సభ్యులను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. మేరీ మట్టి-మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా వీరులు కుటుంబాలను గౌరవించారు. గ్రామానికి చెందిన శీలం సత్యనారాయణమూర్తి (జీపు సత్యం), మిలటరీ ఎక్స్ సర్వీస్‌మన్ పలివెల సత్యనారాయణలను శాలువా కప్పి సత్కరించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ పాత్రికేయుడు కోట ఈశ్వరరావుకు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సర్పంచులు కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి తదితరులు పాల్గొన్నారు.

పంచభూతాలను పరిరక్షించుకోవాలి



శేరిలంక పంచాయతీ వద్ద పంచ్‌ప్రాణ్ ప్రతిష్ఠలో భాగంగా అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కె.గంగవరం: గాలి, నీరు, ఆకాశం, భూమి కలుషితం కాకుండా పరిరక్షింకోవాలని సర్పంచ్ కొండేపూడి భద్రరావు, ఎంపీటీసీ కొండేపూడి గంగా భవాని అప్పారావు అన్నారు. మండలంలోని శేరిలంకలో సోమవారం మన భూమి-మన దేశం కార్యక్రమంలో భాగంగా పంచాయతీల వద్ద పంచ్ ప్రాణ్ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పంచభూతాలను కలుషితం చేయడం వల్ల మానవాళి జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు కాలుష్య నివారణలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు స్వాతంత్ర్యోద్యమ కీర్తిని చాటే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కన్వీనర్లు చంటిబాబు, శ్రీనివాసరావు, కార్యదర్శి యం.నాగేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరినాట్లు



గొల్లపాలెంలో వరినాట్లు వేస్తున్న మహిళలు

కాజులూరు: ఆగస్టు నెలలో సగం రోజులు పూర్తి కావస్తున్నా ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో నేటికి వరి నాట్లు కొనసాగుతున్నాయి. జూన్ నెలాఖరు నాటికే నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు మొదటి నుంచి చెప్పుకొస్తున్నారు. అయితే రైతులకు ఎదురవుతున్న పలు ప్రతికూల పరిస్థితులు వరి సాగుకు ఆలస్యానికి కారణమవుతున్నాయి. డెల్టాలో రైతులను మూడు పంటలకు ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ ఏడాది ప్రభుత్వం జూన్ ఒకటో తేదీనే కాలువలకు నీరు విడుదల చేసింది. అయితే అధికశాతం రైతులు నారుమడులు వేసుకున్న సమయంలో విడవకుండా చెదురుమదురు వర్షాలు పడటంతో మొలకలు వచ్చే నారు నీట మునిగి కుళ్లిపోయింది. దీంతో భారీగా నారు కొరత ఏర్పడటం తదితర కారణాలతో మండలంలో తొలకరి సాగుకు తీవ్ర జాప్యం జరిగింది. అయితే వ్యవసాయాధికారులు ఖరీఫ్ సాగుకు అదను దాటిపోయిందని చెబుతున్నారు కదా..? అని రైతులను అడగ్గా.. తమది టైలాండ్ ఏరియా అని వరి తప్ప మరో ప్రత్యామ్నాయ పంటలకు పొలాల్లో అవకాశం లేకపోవటంతో సమయం మించిపోయినప్పటికీ నాట్లు వేయవలసి వస్తుందని రైతులు చెబుతున్నారు.

విద్యుత్తు లైన్లు సరిచేయించాలి



స్పందనలో ఎంపీడీఓ రాజుకు వినతిపత్రం అందిస్తున్న రాజుబాబు

మండపేట: పట్టణంలోని వీరభద్రపురం సమీపంలోని రామచంద్రపురం రోడ్డు ఉత్తర వైపున పొలాల్లో కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న పురాతన విద్యుత్ లైన్‌ను సరి చేయించాలని ఆ ప్రాంతానికి చెందిన ఎస్. రాజుబాబు, పలువురు కౌలు రైతులు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ ఐ. రాజులకు వారు వినతిపత్రం అందజేశారు. పాత ఐరన్ స్తంభాలు తుప్పు పట్టిపోయాయని, విద్యుత్తు వైర్లు కిందికి వేలాడుతుండడంతో దారిన వెళ్లే వారు భయాందోళన చెందుతున్నారన్నారు. గతంలో తీగలు రాపిడికి నిప్పురవ్వలు చెలరేగి కింద ఉన్న పశువుల పాకకు నిప్పంటుకుని రెండు పాడి పశువులు మృతి చెందగా, గడ్డివామి, దగ్ధమైందని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలి



రైతులకు చిరుధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ఏఓ అశోక్, సర్పంచ్ దేగల తిరుమలవేణి తదితరులు

కాజులూరు: ప్రకృతి వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బందనపూడిలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బీఎస్ఎఫ్) కింద పలువురు ఎస్సీ రైతులకు అధికారులు చిరుధాన్యాల విత్తనాలతో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ డేగల తిరుమలవేణి అధ్యక్షతన జరిగిన సభలో ఏఓ మాట్లాడుతూ రసాయన ఎరువులతో పంటలు పండించటం ద్వారా ఆహార ఉత్పత్తులు విషతుల్యమయ్యే ప్రమాదం ఉందన్నారు. మల్చింగ్, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో జీవామృతం, బీజామృతాలను ఎరువులుగా ఉపయోగించటం ద్వారా నాణ్యమైన ఉత్పత్తుల సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులకు ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఎంటీ ధనలక్ష్మీ, ఆదివిష్ణు, సత్యవతి, వీఏఏ శిరీష తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది



రాయవరంలో మట్టిని సేకరించి తీసుకుని వెళ్తున్న ప్రజాప్రతినిధులు

రాయవరం: దేశ స్వాతంత్ర్యం కోసం అమర వీరులు చేసిన త్యాగం మరువలేనిదని జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ ఈన్నారు. మండలంలోని లొల్ల, రాయవరం గ్రామాల సర్పంచులు చాట్రాతి జానకి రాంబాబు, చంద్రమళ్ల రామకృష్ణ, వి.సావరంలో ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. లొల్ల గ్రామంలో ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్ ముప్పాటి రాజ్‌కుమార్ తండ్రి కృష్ణను, చైనా బోర్డర్‌లో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పిట్టా శ్రీనివాస్ భార్య శ్రీలక్ష్మిని, రాయవరంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డిని, వి.సావరంలో శతాధిక వృద్ధురాలు సూరమ్మను సత్కరించారు. నాభూమి- నాదేశం, నేలతల్లికి, వీరులకు వందనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనడం ద్వారా దేశభక్తిని చాటుకోవాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు సిరికి కృష్ణారావు, లొల్ల గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, కాకి కోటేశ్వరరావు, గొల్లు శ్రీను, పంపన గోవిందు, మండల హరినాథరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సుధారాణి, ఏఈ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేద్దాం

ఆలమూరు: భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ గుణ్ణం రాంబాబు అన్నారు. మండలంలోని గుమ్మిలేరులో సోమవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన నాభూమి-నాదేశం కార్యక్రమానికి ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను అందించడంతో పాటు పుడమి తల్లిని, పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మన అందరి పైనా ఉందన్నారు. ×నా భూమి-నా దేశం₹ శిలా ఫలకాన్ని పంచాయతీ కార్యదర్శి కె.మోక్షాంజలి, సర్పంచ్ రాంబాబు, ఎంపీడీఓ జాన్‌లింకన్ కలసి ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వీఆర్వో దార్ల అమ్మాజీ, సచివాలయ కార్యదర్శి పి.పద్మ, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.